# బందరు పిచ్చోడు!

నేను గుమ్మంలో అడుగుపెట్టగానే 'ఏమేవ్! మన బందరు పిచ్చోడు వచ్చాడు...' బాబాయ్ గావుకేక పెట్టాడు.

గాడిదకేం తెలుసు గంధం వాసన? బాబాయికేం తెలుసు బందరు గురించి అనుకుని సరిపెట్టుకున్నాను. బాబాయ్ కాబట్టి సరిపోయింది. అదే వేరొకరైతే మీదపడి రక్కి పీక పిసికి చంపేసేవాడిని! పెద్దవాడు... అందునా అంకుల్ కావటాన బతికిపోయాడు.

గాడిదంటే గుర్తుకొచ్చింది... మా బందరులో గార్దభాల సంఖ్య ఎక్కువే! జనాభాలో సగం అవే!!

ఏడాదికోసారి హాలిడేస్‌లో అంకుల్ వాళ్ళింటికి వస్తూంటాను. వాళ్ళకి పిల్లల్లేరు. అందుకే నేనంటే ముద్దు!

'రారా రఘురాం!... రా!!... ఇదేనా రావటం...' నవ్వుతూ పిన్ని ఆహ్వానం పలికింది.

'మా అన్నయ్య వదిన పిల్లలు అంతా క్షేమమేనా?' బాబాయ్ ప్రశ్న.

'బందరు పిచ్చోడంటే ఎవరో అనుకున్నా[ను]!... తీరా వచ్చి చూద్దును కదా... నువ్వు!... మీ బాబాయ్ మాటలకేంలే... ఏవేవో అంటూ ఆటలు పట్టిస్తూంటారు. నిన్ను బందరు పిచ్చోడని పిల్చుకుంటేగానీ మీ బాబాయికి తృప్తిగా వుండదు' దగ్గరగా వచ్చి నా తల నిమురుతూ అంది పిన్ని.

'సమ్మర్ హాలిడేసిచ్చారు. అందుకే మిమ్మల్ని చూచి రమ్మని డాడీ పంపించాడు...'

'మా నాయనే... నా తండ్రే! మేమంటే నీకెంత ప్రేమరా... దొడ్లో కెళ్ళి కాళ్ళు కడుక్కురా. టిఫిన్ పెడతాను...' నాపట్ల పిన్ని చూపే ఆప్యాయతానురాగాలకు మనసు పులకించింది.

విజయవాడ సత్యన్నారాయణపురంలో అంకుల్ వాళ్ళది సొంతిల్లు. బాగా ఆస్తిపరులు. అయినా బాబాయ్‌కి గానీ పిన్నికి పిసరంతైనా గర్వంలేదు.

పిల్లల్లేరనే దిగులొక్కటే వారిని కలవరపెడుతూంటుంది. నన్ను దత్తత చేసుకుంటామని నాన్నను అడిగితే మమ్మీ వప్పుకోలేదు. పిల్లలకు మనకు బరువా ఏమిటి? చెట్టుకు కాయలెన్ని వున్నా వాటి బరువు మోయటంలేదూ? అంటూ అడ్డు తగిలింది.

కేవలం నెలజీతంమీదే డాడీ ఫామిలీని పోషించాలి! వెనక ముందు ఆస్తిపాస్తులు

వేరే ఆదాయం లేకపోవటంతో ముగ్గురు మగపిల్లల్లో ఒక్కడినైనా తమ్ముడికి పెంపకానికిస్తే పిల్లాడైనా సుఖపడతాడని నాన్నకు అన్పించేది. కానీ అమ్మ పడనిచ్చేదికాదు.

ఆ ప్రపోజల్ అక్కడితో డ్రాప్ అయింది! ముగ్గురు అన్నదమ్ముల్లో నామీదే బాబాయ్‌కి చూపు. నన్నే పెంపుడు తీసుకోవాలని ఆరాటపడ్డాడు.

బాబాయ్‌కి బోలెడంత ఆస్తి వుంది. చిన్నతనంలోనే పెంపుడు పోవటాన ఆయనకు కోట్ల ఆస్తి సంక్రమించింది.

వయసులో పెద్దవాడే అయినా బాబాయ్ నాతో సరదాగా క్లోజ్‌గా వుంటాడు. తన కార్లో వెంట పెట్టుకుని ఫ్యాక్టరీకి తీసుకెడతాడు. వున్న పదిరోజుల్లో రోజూ సినిమాకు తీసుకెడతాడు. బయల్దేరేరోజు మనిషి దిగాలు పడిపోయినవాడిలా ముఖం పెట్టి 'మళ్ళీ ఎప్పుడొస్తావురా?' అనేసి కళ్ళనీళ్ళు పెట్టుకోవటం నన్ను కలచివేస్తుంది.

వచ్చినప్పుడల్లా కొత్తబట్టలు కుట్టించి దారి ఖర్చుకు వుంచుకోమంటూ అయిదొందల నోటు జేబులో కుక్కుతాడు.

ఇంతమంచి బాబాయ్‌కి నన్నెందుకు డాడీ దత్తత ఇవ్వలేదో... మమ్మీ ఎందుకు అభ్యంతరం చెప్పిందో నాకు అర్థం కాదు.

'ఒరే రఘూ! నా దగ్గరే వుండిపోరా! నీవు కోరుకున్న చదువు చెప్పిస్తాను. విదేశాలు పంపుతాను. నా సంపదకు వారసుడిని చేస్తాను...' బాబాయ్ కంఠం రుద్రమైంది.

అమ్మో! బందరు వదిలి విజయవాడలో వుండటమే?... నావల్లకాదు.

బందరంటే నాకు వల్లమాలిన అభిమానం. బందరులో వీచేగాలి పీల్చినా... అక్కడి నీరు తాగినా...అక్కడి కళాశాలలో చదివినా... చాలు! జీవితం ధన్యమౌతుంది!!

గొప్ప గొప్ప వారెందరో వుద్భవించిన వూరది! బందరులో ఓడరేవు వుంది! లైట్‌హౌసుంది! ఆంధ్రాబ్యాంక్ పుట్టుక అక్కడే! రోల్డ్‌గోల్డ్ నగల తయారీ అక్కడే! బందరు లడ్డు జన్మస్థలం బందరే! త్రివేణీ బీటల్ నట్ పౌడరు ఆవిర్భావం మా వూళ్లోనే. నటులు... గాయకులు... రచయితలకు విమర్శకులకు పత్రికలకు పుట్టినిల్లు బందరు.

జాతిపిత జన్మస్థలం కూడా బందరే అనుకునేవాడిని. తర్వాత తెలిసింది బాపూజీ పుట్టింది పోర్‌బందర్లోనని.

బందరంటే నాకు పిచ్చి వ్యామోహం! ఐ లైక్ బందరు లైక్ ఎనీథింగ్స్‌ఎల్స్!

నా చదువు అక్కడే కొనసాగాలి... బందరు ఎల్.ఐ.సి.లోనే జాబ్ సంపాదించాలి! అక్కడ తప్పించి మరెక్కడా ఇమడలేని మనస్తత్వం నాది.

ఇంటా బైటా బందరుపట్ల నాకున్న వీరాభిమానం చూచి అందరూ నన్ను బందరు పిచ్చోడని నిక్‌నేమ్‌తో పిలుస్తున్నా బాధపడను.

మావూరినెవరైనా చెడుగా కామెంట్ చేస్తే ఆగ్రహిస్తాను. వాదిస్తాను. వాళ్ళ అంతు చూస్తాను. అదీ నా మెంటాలిటీ!

అంత గొప్ప బందరును నేను అభిమానించి ప్రేమిస్తే తప్పేముంది? ఈ విషయంలో నేను రాజీ పడే ప్రసక్తేలేదు.

★ ★ ★ ★ ★

బందరంటే నాకెంత ఇష్టమో... అత్తకూతురు అమలన్నా అంతే ఇష్టం! మామయ్య వాళ్ళకి చెఱుకుతోటలు... పళ్ళతోటలు బోలెడున్నయ్. అందమైన ఫారమ్ హౌసుంది.

వెళ్ళినప్పుడల్లా అత్తయ్య నాకు ఇష్టమైన అరిసెలు... జంతికలు చేసి పెడుతుంది.

అమల నేను పళ్ళతోటలో కెళ్ళి జామకాయలు... బత్తాయిలు... ద్రాక్ష కావలసినన్ని కోసి తినేవాళ్ళం.

మా ఇరువురి అన్యోన్యత చూచి 'ఒరే రఘూ నా కూతురుని పెళ్ళి చేసుకుంటావుట్రా'...? అనడిగేది.

ముసిముసిగా అమల ముఖంలోకి చూచేవాడిని.

'ఈ బందరు పిచ్చోడిని నేనేం చేసుకోను...' వుక్రోషంతో అనేది అమల.

నాకు కోపం వచ్చి అమలను కొట్టాలని ప్రయత్నిస్తే అది తుర్రుమనేది అందకుండా... నా చేతికి చిక్కకుండా తప్పించుకునేది.

'అబ్బ! ఆపండర్రా మీ గోల... ఏమే అమలా... బావను అట్లా ఏడిపించవచ్చా? తప్పు కదూ?-' దండించే ప్రయత్నం చేసేది అత్తయ్య.

ఒకసారి అమల చెవి మెలేస్తూ 'ఇంకోసారి నన్ను బందరు పిచ్చోడన్నావంటే... నిన్నేం చేస్తానో చూడు...' కళ్ళెర్రచేశాను.

'ఏం చేస్తావే?-' గింజుకుంటూ అనేది.

'తొడపాశం పెడతాను. పిర్రమీద ఒక్కటిస్తాను... ఏమనుకున్నావో...' ఏడిపించటం నాకు సరదా.

'ఓస్! అంతేకదా...?'

'అంతేకాదే... నిన్ను పెళ్ళాడి నీ తిక్క కుదురుస్తాను...'

'ఊరుకోరా రఘూ! అదంతేలే... వఠి మొండిఘటం...' పోట్లాడుకుంటున్న మాకు

అత్తయ్య సర్ది చెప్పేది.

అత్తయ్య వాళ్ళ వూళ్లో వున్నన్నాళ్ళూ రోజులు క్షణంలో గడిచినట్టనిపించేది.

★ ★ ★ ★ ★

చదువు కంప్లీట్ అవగానే నేను అనుకున్నట్టే... బందరు ఎల్.ఐ.సి.లో జాబొచ్చింది! నేను చాలా లక్కీ ఫెలోని అన్నారందరూ.

జాబ్‌లో జాయినైనా నా ప్రొబేషన్ పూర్తి అయిందో లేదో అత్తయ్య అమలతో సహా వచ్చేసి మా ఇంట్లో తిష్ఠవేసింది.

'బావా! నువ్ కారు కొన్నావుటగా... ఏదీ చూపించు...' సంబరపడుతూ అడిగింది.

అమల ఇప్పుడు ఎదిగింది. పెద్దదైంది. అల్లరి చేష్టలకు దాని చెవి మెలేయటానికి సిగ్గుపడ్డాను. అదేం ఎట్రాక్షనోగానీ... అమలను చూడగానే అమాంతం ఎత్తుకెళ్ళి కౌగిట్లో బంధించి ముద్దులతో ముంచెత్తాలన్నంత ఏమోషన్ ఫీలయ్యాను.

అమ్మో... అట్లా చేశానంటే... ఇంకేముంది? అదసలే కోతి! అరిచి గొడవ చేసేస్తుంది. 'క్లీన్‌బౌల్డ్' అయిపోతానేమోననే భయంతో తొందర పడటానికి సాహసించేవాడిని కాదు.

చెయ్యి పుచ్చుకుని షెడ్‌లోకి అమలను లాక్కెళ్ళి కారు చూపాను.

'నీకులాగే అందంగ వుంది. ఎంత ముద్దొస్తోందో బుజ్జిముండ...' అంటూ కారుచుట్టూ ప్రదక్షిణాలు చేసింది.

'నీ కార్లో నన్ను ఎక్కించుకుని బీచ్‌కి తీసుకెళ్ళవా...' మారాం చేసే చిన్నపిల్లలా అడిగింది.

'నువ్వొస్తానంటే... కారులో ఏంటి?... నిన్నెత్తుకెళ్ళనూ అక్కడిదాకా...!'

'ఛీ పో! నీకెప్పుడూ అవే ఆలోచన్లు... దోసిట్లో ముఖాన్ని దాచుకుంది.

'సరేలే! నిన్ను కార్లో సీషోర్‌కి తీసుకెడితే... ఊఁ... నాకేమిస్తావ్?-'

'వస్తూ మా తోటలో కాసిన జామపండ్లు తెచ్చానే... వాటిలో నీకెన్ని కావాలంటే అన్ని తినటానికి ఇస్తానే. ఓ.కే...!'

'నో... అవేం వద్దు!...'

'మరైతే ఏం కావాలీ?...' వాలు జడ చేతిలోకి తీసుకుని గిరగిరా తిప్పుతూ అడిగింది.

'ఓ తీయటి ముద్దు... నీ బిగికౌగిలి...' అనేశాను.

'అమ్మో... ఆశ దోశ అప్పడం! అదేం కుదరదు.'

'నేనంటే నీకిష్టమేగా...'

'అయితే?...'

'నీక్కాబోయే మొగుడినే కదా!? ఎడ్వాన్స్‌గా ఇస్తే ఏమౌతుందమ్మా...'

'ఇంక చాల్లే ఆపు నీ సరసాలు... ఇంతకూ నన్ను కార్లో బీచ్‌కి తీసుకెడతావా లేదా?-' బుంగమూతి పెట్టింది.

'తీసుకెళ్తా...! తీసుకెళ్ళి నిన్ను సముద్రం నీటిలో ముంచుతా!... తడిబట్టలతో వున్న నీ వొంపుసొంపులను ఆదమరిచి చూస్తా...'

'చాలు చాల్లే ఆపు నీ సినిమా డైలాగులు...'

'నేనంటే నీకిష్టంలేదా?-' నొసలు చిట్లించి చిరుకోపం ప్రదర్శించాను.

'నువ్వో బందరు పిచ్చోడివి... ఇష్టం లేకపోతే మీ వూరెందుకొస్తాను?... నీతో ఎందుకు మాట్లాడతాను?...'

నాలో కోపం రగిలింది. చెవి మెలేశాను.

'ఏంటీ పిచ్చి వేషాలు?-'

'లేకుంటే నన్ను బందరు పిచ్చోడంటావా?...' సీరియస్‌గా అన్నాను చెవి వదిలేస్తూ.

గంతులేసుకుంటూ అక్కడ్నించి వెడుతూ 'పిచ్చోడితో నాకేంట్లే...' అనేసింది.

అమల నన్ను 'బందరు పిచ్చోడ'ని పిలవటమే నాకు బొత్తిగా నచ్చని విషయం. ఆ విధంగా పిలిచినప్పుడల్లా దాని బుగ్గలు సాగదీయాలన్పిస్తుంది.

వాళ్ళ వూళ్లో జూనియర్ కాలేజీ లేకపోవటంతో టెన్త్‌తో చదువుకు మంగళం పాడింది! సిటీ పంపి హాస్టల్లో వుంచటం అత్తయ్యకు ఇష్టంలేదు.

మామయ్య వూళ్ళో గొడవలతో... తన్నెక్కడ చంపేస్తారోని భయపడి వూరొదిలి పారిపోయాడు అమల చిన్నప్పుడు. ఆ వెళ్ళినవాడు మళ్ళీ తిరిగి రాలేదు. అసలు ఎక్కడున్నాడో? ఎలా వున్నాడో? బ్రతికి వున్నాడో లేదో కూడా అత్తయ్యకుగాని మాకు గానీ ఎవరికీ తెలియదు.

రాజకీయపరమైన కక్షలుండటాన... మామయ్య కన్పించకపోవటం గురించి ఆరోజుల్లో పోలీసు రిపోర్టు కూడా ఇవ్వలేదని ఓసారి అత్తయ్య నాతో చెప్పి బావురుమంది.

అమలను నాకిచ్చి కట్టబెట్టాలని అత్తయ్యకు బోలెడంత ఆశ... ఆపేక్ష!!

★ ★ ★ ★ ★

రాత్రి ఇంట్లో జనరల్ బాడీ మీటింగ్ ఏర్పాటైంది. అమల తప్ప కుటుంబ సభ్యులు అత్తయ్యా ఒక చోట కూర్చుని నా పెళ్ళి గురించి సీరియస్‌గ చర్చిస్తున్నారు.

అమల లేదని గ్రహించి 'అత్తయ్యా... నేను అమలను చస్తే చేసుకోను...' తెగేసి చెప్పాను.

నా సమాధానం విన్న అంతా విస్తుపోయారు.

'ఏరా... ఎందుకని?-' డాడీ మమ్మీ ముక్తకంఠంతో ప్రశ్నించారు.

'దాని ధోరణి నచ్చలేదు- నన్ను ఇప్పటికీ బందరు పిచ్చోడనే పిలుస్తోంది అమల! ఐ డోన్ట్ లైకిట్...'

అందరూ ఫక్కున నవ్వారు. నేను ఉడుక్కున్నాను.

'ఒరే రఘూ!... ఈ రోజుల్లో భార్య భర్తని పేరు పెట్టి పిలవటం... ఒరే తురే అనుకోవటం కామనైంది! దాన్ని గురించి నువ్వేం బాధపడకు! ఇద్దరి మధ్య అవగాహన అనురాగం వుంటే చాలు!... పిలుచుకోవటాలు ముఖ్యం కాదు...'

'అది రాక్షసి!... గయ్యాళిగంప! దాన్ని చేసుకుని వేగలేను...'

నేను ఏవంక చెప్పినా... మెంబర్సంతా తేలిగ్గా కొట్టిపారేశారు.

పైకి అట్లా మాట్లాడానేగాని... నాకు మాత్రం అమలను చేసుకోవాలనే వుంది మనసులో! అదీ అసలు సీక్రెట్!!

అమలతో పెళ్ళి ఖాయమైంది. తాంబూలాలు పుచ్చేసుకుని లగ్గాలు పెట్టేసుకున్నారు.

ఇద్దరి నెత్తిన జీలకర్ర, బెల్లం... అమల మెడలో తాళి పడ్డది. అక్షితలు చల్లి అందరూ ఆశీర్వదించారు.

శోభనం సీన్లోకొచ్చేశాం నేనూ అమల!

పాలగ్లాసున్న చేయి ముందుకు చాచి 'ఓరి బందరు పిచ్చోడా... ఇవిగో పాలు. నాకేం వుంచక్కర్లేదు. నేను రెండు సిప్పులు చేసే నీకిస్తున్నాను...' అంది అమల కొంటెగ.

శోభనం రాత్రి అమల నన్ను అలా సంబోధించినందుకు బాధన్పించలేదు. అలా పిలవటంలోని మాధుర్యానికి మెలికలు తిరిగాను.

'ఇకపై నన్నలాగే పిలు డియర్...' అంటూ గాఢంగ హృదయానికి హత్తుకుని తన్మయత్వానికి లోనైనాను!!

- సమాప్తం -